ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ జిల్లా వార్తలు
శనివారం 6 ఏప్రిల్ 2024 | 5



రంజాన్ వేళలు ఇఫ్తార్ (శని) సా.6.25 సహరి (ఆది) ఉ.4.31

ఏం చేశారని ఓట్లు అడగడానికి వచ్చారు..? - 7లో

ముమ్మిడివరం వైసీపీ అభ్యర్థి పొన్నాడను నిలదీసిన మహిళలు

రేషన్ డీలర్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది - 8లో

- రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు మాధవరావు

ప్రేమజంట ఆత్మహత్య - 7లో

- తమ ప్రేమను పెద్దలు అంగీకరించరని గడ్డిమందు తాగిన వైనం
- అపస్మారక స్థితిలో రోడ్డుపక్కన పడి ఉన్న యువకుడు, బాలిక
- ఆస్పత్రిలో చేర్చినా చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి
- అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఘటన
- ఇద్దరూ కాకినాడ జిల్లా ఏలేశ్వరం వాసులు

విశాఖ సముద్ర జలాల్లో కాకినాడ బోటు దగ్ధం - 8లో

- 9మంది మత్స్యకారులను తరలించిన కోస్ట్ గార్డ్‌లు
- నలుగురికి తీవ్రగాయాలు.. ఐదుగురికి స్వల్పంగా..







కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగబాబు, హాజరైన జనసేన శ్రేణులు

'ప్రచారం' పరుగు



- జిల్లావ్యాప్తంగా నియోజకవర్గాల్లో టీడీపీ ఎన్నికల ప్రచారం జోరు
- ఉదయం సమావేశాలు, సాయంత్రం వేళల్లో అభ్యర్థులు ఇంటింటా ప్రచారం
- సూపర్‌సిక్స్ పథకాలను విస్తృతంగా తీసుకువెళ్తూ జనంతో మమేకం
- అటు ఎక్కడికక్కడ సమస్యలు, వైసీపీ దౌర్జన్యాలను ఏకరవు పెడుతున్న ప్రజలు
- నాలుగురోజుల వరుస పర్యటనలతో పిఠాపురంలో ఇప్పటికే పవన్ ఉధృత ప్రచారం
- మళ్లీ ఈనెల 9న పవన్ రాక: నియోజకవర్గంలో ఉగాది వేడుకలకు హాజరు
- ఇక్కడినుంచే అభ్యర్థిగా దిగుతుండడంతో పవన్‌కు మద్దతుగా నేతల ప్రచారహోరు
- మరోపక్క ఎక్కడికక్కడ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు జనం నిలదీత
- వైసీపీ అభ్యర్థులు ద్వారంపూడి, గీత, వరుపుల, కన్నబాబుకు చేదు అనుభవాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో జిల్లాలో టీడీపీ, జనసేన అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు సమావేశాలు, ఆత్మీయ కలయికలు, ఇంటింటా ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి కూటమిని గెలిపించాలంటూ గ్రామగ్రామాన అలుపెరుగకుండా తిరుగుతున్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ఎక్కడికక్కడ ప్రజలకు వివరిస్తూ అధికారంలోకి వచ్చిన వెంటనే కలగనున్న ఆర్థిక లబ్ధిని లెక్కలతో సహా చెబుతూ సాగుతున్నారు. దీంతో పల్లెలు, పట్టణాల్లో టీడీపీ అభ్యర్థుల ప్రచారానికి జనం నీరాజనం పడుతున్నారు. అదే సమయంలో రాత్రి వేళల్లో ఇంటింటికీ వెళ్తున్నప్పుడు జనం అనేక సమస్యలను టీడీపీ అభ్యర్థులకు వివరిస్తున్నారు. పథకాల్లో కోతలు, విద్యుత్ బిల్లుల వాతలు, ఇళ్లస్థలాలు ఇవ్వకపోవడం, అధికార పార్టీ నేతల దౌర్జన్యాలను చెబుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ వింటున్న అభ్యర్థులు కొద్దిరోజులు ఓపికపడితే మంచిరోజులు వస్తాయంటూ ధైర్యం చెబుతున్నారు. పిఠాపురం నుంచి బరిలో ఉన్న పవన్ కళ్యాణ్ ఇప్పటికే నాలుగు రోజులు ఉధృత ప్రచారం నిర్వహించి ప్రత్యర్థి పార్టీకి చుక్కలు చూపించారు. ఒకపక్క టీడీపీ కూటమి జనాదరణతో దూసుకుపోతుంటే, వైసీపీకి మాత్రం ప్రజలు చుక్కలు చూపిస్తున్నారు. ప్రచారానికి వస్తున్న అభ్యర్థులను సమస్యలపై నిలదీస్తుండడంతో వైసీపీ శ్రేణులకు కునుకు ఉండడం లేదు.

కలిసికట్టుగా దూసుకుపోతున్నారు..

మరికొద్దిరోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో జిల్లాలో నియోజకవర్గాల టీడీపీ, జనసేన అభ్యర్థులు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. గ్రామగ్రామాన తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్నారు. అదే సమయంలో వైసీపీ అక్రమాలు, అయిదేళ్ల అడ్డగోలు, ప్రజావ్యతిరేక పాలనలో ఎలా రాష్ట్రం నష్టపోయిందో విడమర్చి చెబుతూ ముందుకు కదులుతున్నారు. అటు జనం కూడా తాము పడ్డ కష్టాలను టీడీపీ, జనసేన అభ్యర్థుల ముందు ఏకరువు పెడుతున్నారు. పెద్దాపురంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చినరాజప్ప ఇప్పటికే పెద్దాపురం, సామర్లకోట గ్రామీణ మండలాల్లో ప్రచారజోరును పెంచారు. జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలబాబుతో కలిసి ఉదయం వేళల్లో ఆత్మీయ కలయికలు, వివిధ సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. టీడీపీకి ఎందుకు ఓటువేయాలో చెబుతూ వైసీపీ అక్రమాలను వివరిస్తున్నారు. సాయంత్రంనుంచి గ్రామాల్లో స్థానికులతో చిన్నపాటి సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామ, వ్యక్తిగత సమస్యలు తెలుసుకుంటూ టీడీపీ వచ్చిన తర్వాత అవన్నీ పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. శుక్రవారం సామర్లకోటల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలి వచ్చారు. రాజప్ప తనయుడు రంగనాథ్ సైతం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గ్రామాల్లో భారీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒకపక్క ఆయన కుటుంబ సభ్యులు సైతం సూపర్‌సిక్స్ పథకాలను జనాలకు వివరిస్తూ బాబు ష్యూరిటీ పత్రాలను అందిస్తున్నారు. కాకినాడ సిటీలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు ఉదయం వేళల్లో న్యాయవాదులు, వైద్యులు, ఇతర వృత్తి నిపుణులతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ టీడీపీ కూటమికి మద్దతుగా నిలవాలని ప్రజలకు వివరిస్తున్నారు. వైసీపీ అరాచకాలు నగరంలో పెరిగిపోయాయని, తిరిగి ఆ పార్టీని గెలిపించొద్దంటూ జనసేన, బీజేపీతో కలిసి ప్రచార ఉధృతి పెంచారు. ప్రత్తిపాడులో వరుపుల సత్యప్రభ ఏలేశ్వరం, రౌతులపూడి, ప్రత్తిపాడు మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. క్యాడర్‌తో సమావేశాలు నిర్వహిస్తూ బూత్ స్థాయిలో పార్టీకి ఓట్ల శాతం పెరిగేలా కసరత్తు చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో సబ్‌ప్లాన్ ఏజెన్సీలకు వెళ్లి మరీ ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. తునిలో యనమల దివ్య ఇంటింటా ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. కాకినాడ రూరల్‌లో జనసేన అభ్యర్థి పంతం నానాజీ ఉదయంపూట వివిధ సంఘాలతో ఆత్మీయ సమావేశాలు జరుపుతున్నారు. సాయంత్రంనుంచి రూరల్ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలపై ఆరా తీస్తూనే తనను గెలిపించాలంటూ ప్రచారం చేపట్టారు.

పిఠాపురంలో..

పిఠాపురం జనసేన అభ్యర్థి పవన్‌కళ్యాణ్ ఇప్పటికే నాలుగురోజుల పర్యటనతో కాక రేపారు. ప్రత్యర్థి పార్టీ అంగ, అర్థబలంతో ఓడించేందుకు వ్యూహాలు పన్నినా తనదైన రోడ్డుషో నిర్వహించి వివిధ వర్గాలకు చేరువయ్యారు. తనను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఇప్పటికే పవన్ పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసే క్రమంలో వైసీపీనుంచి భారీ చేరికలను ఆహ్వానిస్తున్నారు. ఇటీవల నాలుగురోజుల పర్యటనలో వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నేతలు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. అటు బూత్‌స్థాయిలోను పార్టీని బలోపేతం చేయడంపై పవన్ దృష్టి సారించారు. పార్టీ కీలకనేత నాగబాబు సైతం పిఠాపురంలోనే మకాం వేసి నియోజకవర్గ నేతలతో సమీక్ష నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో పార్టీనేతలు, క్యాడర్‌తో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పిఠాపురం అసెంబ్లీ, ఇటు కాకినాడ ఎంపీ స్థానాన్ని రెండూ గెలిచేలా ఎన్నికల వ్యూహాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఈనెల 9న పవన్ పిఠాపురంలో ఉగాది వేడుకలను నిర్వహించనున్నారు. తద్వారా నియోజకవర్గంలో సాధ్యమైనన్ని ఎక్కువ రోజులు తిరిగేలా ఎన్నికల వ్యూహం రచించారు. టీడీపీ తరపున వర్మ విస్తృతంగా పర్యటిస్తూ పవన్‌ను గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్నారు. పిఠాపురం అభివృద్ధికి ఇటీవల పవన్ ప్రకటించిన 14 అంశాలను కరపత్రాల ద్వారా భారీగా ప్రచారం చేస్తూ ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు.

బాబోయ్.. ఇవేం నిలదీతలు..

జిల్లాలో వైసీపీ అభ్యర్థులకు మాత్రం ఇంటింటా ప్రచారంలో చుక్కలు కనిపిస్తున్నాయి. ఒకపక్క టీడీపీ, జనసేన అభ్యర్థులు దూసుకుపోతుంటే వైసీపీకి మాత్రం సెగ తలుగుతోంది. ఇటీవల కాకినాడ సిటీ ఏటిమొగలో ఎన్నిల ప్రచారానికి వెళ్లిన ద్వారంపూడిని మత్స్యకారులు చుట్టుముట్టారు. తమ వార్డు ఇప్పుడు గుర్తుకొచ్చిందా అంటూ నిలదీశారు. కాకినాడ రూరల్‌లో ఎమ్మెల్యే కన్నబాబును మత్స్యకారులు ప్రచారం చేయకుండా అడ్డుకున్నారు. గ్రామంలో చెరువులు వేరొకరికి లీజులకు ఇచ్చేసిన కన్నబాబుకు ఇక్కడేం పని అని చుక్కలు చూపారు. ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావును జనం పరుగులు తీయించారు. గ్రామాల్లో అభివృద్ధి లేకపోవడం, సమస్యలు పేరుకుపోవడంతో తమ ఊరికి రావద్దని పలుచోట్ల అడ్డుకున్నారు. పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగాగీతను ప్రచారాల్లో జనం అడ్డుకుంటుంటే ఆత్మీయ సమావేశాల్లో పార్టీకార్యకర్తలు తిరగబడుతున్నారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే


- వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు
- మంత్రి దాడిశెట్టి రాజా హత్యా రాజకీయాలపై ధ్వజం
- సునీల్ ఎంపీ కాకముందే అక్రమాలకు తెరలేపారంటూ విమర్శ
- ఉమ్మడి అభ్యర్థి తంగెళ్లను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచన
- తునిలో జనసేన సర్వసభ్య సమావేశానికి హాజరైన పార్టీశ్రేణులు

తుని రూరల్, ఏప్రిల్ 5: రానున్నది కూటమి ప్రభుత్వమేనని, వైసీపీని తుంగలో తొక్కడం తథ్యమని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు స్పష్టం చేశారు. కాకినాడ కూటమి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ నేతృత్వంలో తునిలో శుక్రవారం జరిగిన తుని నియోజకవర్గ పార్టీ సర్వసభ్య ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ ప్రసంగించారు. తుని నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి దాడిశెట్టి రాజా నెంబర్‌వన్ క్రిమినల్ అని నాగబాబు ఆరోపించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌మీద వ్యక్తిగతంగా నోరుపారేసుకుని అసత్యపు ఆరోపణలు చేయడం అనరాని మాటలు అనడం తప్ప నియోజకవర్గానికి ఆయన చేసింది ఏమీ లేదని దుయ్యబట్టారు. హత్యా రాజకీయాలు చేసే దాడిశెట్టి రాజాను ఓడించాలని పిలుపునిచ్చారు. ముద్దులు పెట్టి మోసాలు చేసే వైసీపీ నాయకులు కావాలా? ప్రజా సమస్యలు తెలుసుకునే జనసేన నాయకుడు కావాలా? అన్నారు. మధ్య తరగతి కుటుంబాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ పాలనలో ఒక్క అవినీతి కూడా జరగలేదని చెప్పిన జగన్ మాట అతిపెద్ద జోకు అని, మరుసటి రోజే రాష్ట్రంలో 8లక్షల అవినీతి ఫిర్యాదులు నమోదయ్యాయనే నిజాలను జనసేన బయట పెట్టిందని తెలిపారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా తాగి పేద కుటుంబాలు మరణిస్తే దేవాలయం లాంటి శాసనసభలో అబద్ధాలు చెప్పిన ఘనత జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈసారి మీ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఓట్లు వేయాలని, ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్‌ను, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను భారీమెజార్టీతో గెలిపించుకుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న కూటమి భాగస్వామ్య పార్టీ ప్రభుత్వంనుంచి ఆశించిన స్థాయిలో నిధులు తీసుకొచ్చి కాకినాడ జిల్లాను అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

● పొత్తు కోసం నా సీటే త్యాగం చేశాను

అనకాపల్లి లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు తాను సిద్ధమైన సంగతి వాస్తవాన్ని వెల్లడించారు. పోటీకి సిద్ధంగా ఉండమని జనసేన అధినేత చెప్పారని, తర్వాత పొత్తు పరిణామాల్లో బీజేపీకి ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని పవన్‌కల్యాణ్ చెప్పడంతో మరుక్షణమే తప్పుకున్నానన్నారు. ఒక జనసైనికుడిగా పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు తాను ఇచ్చిన గౌరవం అని కార్యకర్తలకు వెల్లడించారు. పవన్‌కల్యాణ్ పిలుపునకు అనుగుణంగా జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ నిధులతో ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలు జగన్‌రెడ్డి పేరు పెట్టుకుని ఫ్రీ పబ్లిసిటీ చేసుకున్నారని నాగబాబు ఆరోపించారు. దేశానికి దిక్సూచి అయిన మహానుభావుడు అంబేడ్కర్ పేరు మీద ఉన్న సంక్షేమ పథకాలకు పేరు మార్చి జగన్‌రెడ్డి పేరు పెట్టుకోవడం ఏంటని ప్రశ్నించారు. చలమలశెట్టి సునీల్ అనే వ్యక్తి ఎంపీ కాకుండానే కాకినాడలో మైనింగ్ మాఫియా నడుపుతూ కోట్లు దోచుకుంటున్నారని, ఆయనకు అవకాశం ఇస్తే మరింత దోచుకుంటారని ఆందోళన వ్యక్తం చేశారు. పొత్తులో భాగంగా కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించుకుంటే స్థానికంగా అందరికీ అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్, దర్శకుడు మెహర్‌రమేష్, జనసేన ఎన్ఆర్ఐ విభాగం ఆస్ట్రేలియా కన్వీనర్ పులికొండ శశిధర్, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి కిరణ్, తుని నియోజకవర్గ సమన్వయకర్త గణేష్, జిల్లా కార్యదర్శి వంగలపూడి నాగేంద్ర, ఆ పార్టీ నాయకులు మద్రి వీరబాబు, నియోజకవర్గానికి చెందిన పలువురు జనసేన నాయకులు ఉన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి - 8లో



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ జె.నివాస్

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- టీడీపీ జోన్-టు పరిశీలకుడు సుజయ్ కృష్ణ రంగారావు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు పనిచేయాలని పార్టీ జోన్-2 పరిశీలకుడు సుజయ్ కృష్ణ రంగారావు సూచించారు. కాకినాడ టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన, సానా సతీష్‌బాబు కలిసి పలువురు నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు, మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, మాజీ కార్పొరేటర్ వనమాడి ఉమాశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు సుజయ్ కృష్ణ రంగారావు, సానా సతీష్‌బాబు నాయకులతో వేర్వేరుగా మాట్లాడారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని ఓడించే విషయంలో అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. టీడీపీ, జనసేన అభ్యర్థుల గెలుపుకోసం సమష్టిగా పనిచేయాలన్నారు. నాయకులు విభేదాలు వీడి పార్టీ విజయం కోసం కలిసికట్టుగా శ్రమించాలన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ పాల్గొన్నారు.

యువత ఓటుహక్కు వినియోగించుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల్లో యువత తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుని, ఓటింగ్‌శాతాన్ని పెంచాలని కలెక్టర్ జె.నివాస్ పిలుపునిచ్చారు. కాకినాడ సూర్యకళామందిరంలో సంజీవ్ కళాశాల ఆధ్వర్యంలో ఓటుపై చైతన్యం కల్పించేందుకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంజీవ్ కళాశాల ప్రతినిధులు ఆనందరాయుడు, రామ సంజీవ్, రామ్ ప్రసాద్, కాకినాడ అర్బన్ తహసీల్దార్ చెల్లన్న దొర పాల్గొన్నారు.



కార్యక్రమంలో కలెక్టర్ నివాస్

సమ్మె కాలానికి వేతనమేదీ

- తిరిగి విధుల్లో చేరి రెండు నెలలైనా అందని జీతాలు
- జీతాలు రాకపోవడంతో నిరాశలో అంగన్‌వాడీలు

సామర్లకోట, ఏప్రిల్ 5: మూడు నెలల క్రితం తమ సమస్యల పరిష్కారంకోసం సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీ ఉద్యోగులకు సమస్యల పరిష్కారం మాటెలా ఉన్నా వేతనాలు కూడా దక్కని పరిస్థితి వచ్చి పడింది. సమ్మె విరమించి ఇప్పటికి రెండు నెలలు పూర్తయినా సమ్మె కాలానికి సంబంధించి వారికి రావాల్సిన వేతనాలు శుక్రవారం వరకూ వారికి దక్కలేదు, ఇదిగో.. అదిగో అంటూ రెండు నెలలుగా నెట్టుకొచ్చిన ప్రభుత్వం వారికి వేతనాలు ఇవ్వలేకపోయింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వారికి వేతనాలు వస్తాయా, రావా అనే ఆందోళనలో అంగన్‌వాడీ ఉద్యోగులు అల్లాడిపోతున్నారు.

సమస్యల మాటేమో గానీ..

అంగన్‌వాడీ కేంద్రాలను ఏళ్లకేళ్లుగా వేధిస్తున్న సమస్యల పరిష్కారంకోసం కనీస వేతనాల కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు కిందటి ఏడాది డిసెంబరు 8న సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చర్చలకు పిలవడంతో దాన్ని డిసెంబరు 12 వరకూ వాయిదా వేసుకున్నారు. చర్చల్లో ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో విధిలేని పరిస్థితిలో డిసెంబరు 12న సమ్మెకు దిగారు. ఆరోజు నుంచి ఈ ఏడాది జనవరి 23 వరకూ ప్రభుత్వం అధికారులు ఎన్నిరకాలుగా భయపెట్టినా, బెదిరించినా, ఎస్మా ప్రయోగించినా వెనుకంజ వేయకుండా 42 రోజులపాటు సమ్మె చేశారు. ఉద్యమ క్రమంలో చర్చల పేరిట అంగన్‌వాడీ ఉద్యోగులను పిలిచినా ఒక్క సమస్యపై కూడా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో ఉద్యమం అంతకంతకూ పెరిగిపోయింది. అంగన్‌వాడీ ఉద్యోగులు ఎంతకీ లొంగి రాకపోవడంతో ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల తొలగింపునకు ఆదేశాలు జారీచేసింది. వాటిని కూడా అంగన్‌వాడీ ఉద్యోగులు లెక్కచేయక తమ ఆందోళన కొనసాగించారు. అంగన్‌వాడీ ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులు ఇళ్లకే పంపించారు. దీంతో ఉద్యోగులు అర్ధంతరంగా తమ ఆందోళనను విరమించాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం మరోమారు చర్చలకి అని పిలిచినా 2024, జూన్‌లో ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరుపుతామని చెప్పింది. సమ్మె కాలానికి వేతనం ఇస్తామన్న హామీ లభించడం మినహా అంగన్‌వాడీ ఉద్యోగులకు ఏ ఒక్క హామీ కూడా దక్కలేదు. కానీ ఇప్పుడు ఆ హామీ కూడా అమలుకు నోచుకోలేదు.

రెండు నెలలుగా సాగదీత

అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె విరమించి ఇప్పటికి రెండు నెలలు దాటిపోయింది. ఈ ఏడాది జనవరి 23న వారు సమ్మె విరమించారు. ఆరోజు నుంచి ఈరోజు వరకూ వారికి సమ్మె కాలం 42 రోజులకు సంబంధించిన వేతనం మాత్రం దక్కలేదు. జీతం మీదే ఆధారపడే చిరుద్యోగులు కావడంతో వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీస వేతనం రూ.14,500 కంటే రూ.3వేలు తక్కువ. జీతం నెలకు రూ.11,500తో సరిపుచ్చుకుంటున్న వారికి 42రోజుల జీతం ఆగిపోవడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. జీతాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం మాత్రం దక్కలేదు. ఇదిలా కొనసాగుతుండగానే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో వారికి జీతాలు ఎప్పుడు అందుతాయనేది సమాధానం లేని ప్రశ్నగా మారింది.

కాకినాడ జిల్లాలో 1980 అంగన్‌వాడీ కేంద్రాలు

కాకినాడ జిల్లాలో 9 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా ఒక్కొక్క ప్రాజెక్ట్ పరిధిలో రెండు నుంచి నాలుగు మండలాలు ఉండగా జిల్లావ్యాప్తంగా 1,980 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 1,931 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 49 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచరు మాత్రమే ఉంటారు. ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రంలోను ఒక టీచరు, ఒక హెల్పర్ చొప్పున 3,811మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

ఎన్నికల కోడ్ వచ్చాక జీతాలు పడతాయా

-దాడి బేబీ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు

ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కూడా అమలులోకి వచ్చింది. ఇక జీతాలు వస్తాయా అనేది అనుమానమే. ప్రభుత్వం ముందుగానే సమ్మె కాలపు జీతాలు ఇవ్వాలి. కావాలనే ఎన్నికల కోడ్ వరకూ ప్రభుత్వం తాత్సారం చేసింది.

రెండు నెలలైనా జీతాలు రాలేదు

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వడ్డి ఎస్తేరురాణి, ఉండూరు

సమ్మె విరమణ చేసి రెండు నెలలైనా ఇప్పటివరకూ జీతాలు పడలేదు. ప్రభుత్వం ఎంతో నమ్మకంగా సమ్మె కాలానికి జీతాలు ఇస్తామని చెప్పింది. దీంతోపాటు ఒక నెల జీతం కూడా పెండింగ్‌లో పెట్టింది. ఇది కక్షసాధింపు చర్యల్లో భాగమేనని మాకు అనుమానం కలుగుతోంది.

పవన్ విజయం కోసం ప్రచార కమిటీలు

- నేతలతో జనసేన నేత నాగేంద్రబాబు సమావేశాలు

పిఠాపురం, ఏప్రిల్ 5: జనసేన అధినేత పిఠాపురం నియోజకవర్గంనుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ నేతలు ఇక్కడ ప్రత్యేక దృష్టిసారించారు. మూడురోజులుగా పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఉన్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు పార్టీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పవన్, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ గెలుపుకోసం ఎన్నికల ప్రచార కమిటీలను నియమించారు. వీరు ఇప్పటినుంచే తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వర్తించడంతోపాటు 9 నుంచి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. తెలుగుదేశం, బీజేపీతో సమన్వయంతో పనిచేయాలన్నారు. పవన్‌కల్యాణ్ కనీసం లక్ష ఓట్లు మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, పార్టీ కేంద్ర ప్రచార కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పవన్ రెండో విడత పర్యటన ఖరారు - 7లో

- 9న పిఠాపురంలో ఉగాది వేడుకల్లో పాల్గొననున్న జనసేనాని
- పవన్ నివాసముండేందుకు ఇల్లు సిద్ధం
- చేబ్రోలు బైపాస్‌రోడ్డులో ఎంపిక
- ఉగాది వేడుకలు ఇక్కడే జరుపుకునేలా ఏర్పాట్లు

పిఠాపురంలో వైసీపీకి షాక్ - 8లో

- జనసేనలో చేరిన మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్.. భారీగా చేరికలు



నాగబాబు సమక్షంలో జనసేనలో చేరిన పిఠాపురం మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ జోగా వెంకటరమణ



కేరళ వాయిద్య బృందం ప్రదర్శన

ఆత్రేయపురం, ఏప్రిల్ 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్స వాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్స వాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజైన శుక్రవారం ఉదయం వసంత మండపంలో చతు ర్వేద పారాయణ, ద్రవిడ వేద పారాయణలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మేళతాళ మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారి పల్లకి మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిం చారు. వాయిద్య కళాకారుల ప్రదర్శనలు భక్తు లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాత్రి చంగోలం పారాయణం జరిపారు. ఈవో భూపతిరాజు కిషో ర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాడపల్లిలో ఘనంగా ప్రారంభమైన
అధ్యయనోత్సవాలు



స్వామివారి పల్లకి మహోత్సవం



- చతుర్వేద పారాయణం, ద్రవిడ వేద పారాయణం నిర్వహించిన వేద పండితులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్

- అక్కడికక్కడే యువకుడి మృతి
- గాయాలతో బయటపడ్డ మరొకరు





శ్రీరామ్ (ఫైల్‌ఫొటో)

ముమ్మిడివరం/అంబాజీపేట, ఏప్రిల్ 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ బొండా యికోడు సమీపంలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. అపోలో ఫార్మశీలో పని చేస్తున్న అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రా మానికి చెందిన నక్కా శ్రీరామ్ (32), అయినవిల్లి మండ లం నేదునూరుకుచెందిన నక్కా శ్రీనివాస్ మోటారు సైకి ల్‌పై కాకినాడలో జరిగిన సమావేశానికి హాజరై తిరిగి వస్తున్నారు. బొండాయికోడు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని వారు ఢీకొన డంతో శ్రీరామ్ అక్కడికక్కడే మృతి చెం దగా శ్రీనివాస్ గాయాలతో బయటపడ్డా డు. క్షతగాత్రుడిని అంబులెన్సులో ము మ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. శ్రీరామ్ మృతితో పుల్లేటికుర్రు నక్కావారిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తండ్రి తాతారావు, తల్లి మేరీ, కుటుంబ సభ్యులు బోరున విలపిం చడం చూపరులను కంటతడి పెట్టించింది.

పవన్ రెండో విడత పర్యటన ఖరారు

- 9న పిఠాపురంలో జరిగే ఉగాది వేడుకల్లో పాల్గొననున్న జనసేనాని



పిఠాపురం, ఏప్రిల్ 5: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రెండో విడత పర్యటన ఖరారయింది. ఉగాది రోజున ఆయన పిఠాపురంలో ఉండనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో నాలుగురో జులు పర్యటించి ఈనెల 2వ తేదీ రాత్రి విజయవాడ వెళ్లిన పవన్‌కల్యాణ్‌కు తీవ్ర జ్వరం రావడంతో హైదరాబాద్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. మూడు రోజులు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో ఆయన హైదరాబాద్‌కే పరిమిత మయ్యారు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత ప్రచార షెడ్యూల్‌ను ఖరా రు చేశారు. 7వ తేదీన అనకాపల్లి, 8వ తేదీన యలమంచిలిలో పర్యటించి అక్కడ బహిరంగ సభల్లో పాల్గొనను న్నారు. అనంతరం 9వ తేదీన పిఠాపు రం నియోజకవర్గంలో జరిగే ఉగాది వేడుకల్లో పవన్ పాల్గొంటారు. 9వ తేదీ అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేస్తా మని జనసేన వర్గాలు తెలిపాయి. రెండో విడత పర్యటనలో భాగంగా పవన్ పిఠా పురం వచ్చి ఉగాది వేడుకల్లో పాల్గొన నుండటంతో జనసేన నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైసీపీ సమావేశంలో పాల్గొన్న రేషన్ డీలరు సస్పెన్షన్

రాయవరం, ఏప్రిల్ 5: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వైసీపీ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రేషన్ డీలరును తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ గురువారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయ వరం మండలం మాచవరానికి చెందిన 17వ నెంబరు రేషన్ డీలర్ కత్తుల అప్పారావు గత నెల 30న గ్రామంలో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ విషయమై పలువురు ఆర్వోకు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. వాటి ఆధారంగా డీలర్‌పై సస్పెన్షన్ విధించారు. ఆ రేషన్ దుకాణంలోని స్టాకును 14వ నెంబరు రేషన్ డీలర్‌కు ఎంఎస్‌వో ఆలీషా శుక్రవారం అప్పగించినట్టు తహసీల్దారు ఆర్వీ కృష్ణారావు తెలిపారు.

రూ.2.64 లక్షలు సీజ్



డబ్బును సీజ్ చేసిన అధికారులు

పి.గన్నవరం, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంకలో వాహనాల తనిఖీల్లో భాగంగా ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.2.64 లక్షలు సీజ్ చేసినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎస్‌జేవీ రామమో హనరావు తెలిపారు. ఏపీ05ఎఫ్ఏ0444 కారు లో మట్టపర్తి సోమశేఖర్‌కు చెందిన రూ.1.95 లక్షలు, ద్విచక్ర వాహనంలో కొంపెల్ల శ్రీరామ సుబ్రహ్మణ్యానికి చెందిన రూ.69 వేలు గుర్తిం చామన్నారు. వాటికి ఏ విధమైన ఆధారాలూ చూపకపోవడంతో సంబంధిత నగదును సీజ్ చేసి రెవెన్యూ అధికారుల పంచనామా అనంతరం తదుపరి చర్యల నిమిత్తం పోలీసులకు అప్పగించినట్టు రామమోహనరావు చెప్పారు.

రూ.1.38 లక్షలు సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సామర్లకోట, ఏప్రిల్ 5: సామర్లకోట ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ సమీపాన పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కెవీఆర్ గుప్త, ఇతర అధికారులు శుక్రవారం సాయ ంత్రం పలు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా ఏడీబీ రోడ్డులో స్కూటర్ డిక్కీలో దాచి ఉంచిన ఎటువంటి బిల్లులు, ఆధారాలు లేని సుమారు రూ.1.38 లక్షల నగదును స్క్వాడ్ అధి కారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పూర్తి నివే దికలను జిల్లా ఎన్నికల అధికారికి అందజేసి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

మండపేటలో రేషన్ బియ్యం స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం

మండపేట, ఏప్రిల్ 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో రూ.72 లక్షలు విలువ చేసే రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మండపేట పట్టణంలోని సైదిల్‌పేటకు చెందిన పెరుమళ్ల రాంబాబు ఒక్కొక్కటీ 50 కిలోల చొప్పున 76 బస్తాలను అక్రమంగా నిల్వ చేశాడు. రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడి చేసి రేషన్ బియ్యంగా నిర్ధారించి సీజ్ చేశారు. రేషన్ బియ్యం సంచులు సీలు విప్పకుండానే నేరుగా వ్యాపారి వద్ద లభ్యం కావడంతో అధికారులు అవాక్కయ్యారు. పట్టుబడ్డ బియ్యాన్ని స్థానిక సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించారు. వ్యాపారిపై కేసు నమోదు చేసినట్టు డిప్యూటీ తహసీల్దారు అలీషా తెలిపారు.

రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో
క్యూఆర్ కోడ్



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లోని సాధారణ టికెట్ల(అన్ రిజర్వుడు)ను క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బులు చెల్లించి తీసుకోవచ్చు. ఈ మేరకు సాధారణ టికెట్ కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని విజయవాడ రైల్వే డివిజన్‌లోని విజయవాడ, ఏలూరు, తెనాలి, రాజమండ్రి రైల్వే స్టేషన్లలో అందుబాటులోకి తెచ్చారు. టికెట్లు తీసుకునే సమయంలో చిల్లర సమస్యను అధిగమించడంతో పాటు నగదు లావాదేవీలను తగ్గించడంలో భాగంగా డిజిటల్ సౌకర్యాలను మెరుగు పరుస్తున్నామని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏం చేశారని ఓట్లు అడగడానికి వచ్చారు..?

ముమ్మిడివరం వైసీపీ అభ్యర్థి పొన్నాడను నిలదీసిన మహిళలు



పొన్నాడను ప్రశ్నిస్తున్న మహిళలు

తాళ్లరేవు, ఏప్రిల్ 5: ముమ్మిడివరం వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ తన సామాజికవర్గానికి తప్ప ఇతర వర్గాలకు ఏం చేశారని రాఘవేంద్రపురం మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పటవల పంచాయతీ రాఘవేంద్రపురం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు మహి ళలు మాట్లాడుతూ ఎమ్మెల్యే వస్తున్నారని డ్రైనేజీలకు బ్లీచింగ్ కొట్టారని, పురుగులతో కుళాయినీరు సరఫరా అవుతుందని తాగలేకపోతున్నామన్నారు. ఓఎన్‌జీసీ డబ్బులు మత్స్యకారులకే ఇస్తున్నారు తప్ప ఇతరులకు ఇవ్వడం లేదని తమ ఓట్లు మాత్రం కావాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు సమస్యలను ప్రస్తావిస్తుంటే స్థానికేతర కార్యకర్తలు ఎదురుదాడికి దిగి అక్కడ నుంచి జారుకున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష



విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, ఏప్రిల్ 5: అన్నవరం దేవస్థానంలో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథ కానికి శుక్రవారం భీమవరానికి చెందిన ఎస్.కె.జీ కృష్ణం రాజు రూ.1,11,116 విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఏపీఆర్వో గణపతికి అందచేయగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రత్యేక ద ర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

ప్రేమజంట ఆత్మహత్య

- ఇంట్లో అంగీకరించరనే భయంతో గడ్డిమందు తాగిన వైనం
- అపస్మారక స్థితిలో రోడ్డుపక్కన పడి ఉన్న యువకుడు, బాలిక
- ఆస్పత్రికి తరలింపు.. చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి
- అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఘటన..



అశోక్

ఏలేశ్వరం/నర్సీపట్నం, ఏప్రిల్ 5: కాకినాడ జిల్లా ఏలేశ్వరం ప్రాంతానికి చెందిన ప్రేమజంట (బాలిక, యువకుడు) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు సంబంధించి అనకాపల్లి జిల్లా నర్సీపట్నం రూరల్ పోలీసులు, ఏలేశ్వరం వాసులు అందించిన వివరాల ప్రకారం.. ఏలేశ్వరం పట్టణంలోని పెద్దవీధికి చెందిన తాండ్రాజు అశోక్ (25), ఏలేశ్వరం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) ప్రేమించుకుంటున్నారు. కాగా పెద్దలు తమ ప్రేమను అంగీకరించరనే భయంతో నాలుగురోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయారు. అప్పటినుంచి వీరు ఫోన్లు అందుబాటులో లేవు. గురువారం అర్ధరాత్రి సమయంలో బాలిక ఫోన్ ఆన్ చేయగా ఇంటినుంచి కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. దీంతో ఏం జరుగుతుందోననే ఆందోళనతో.. తమను విడదీస్తారేమోనన్న భయంతో వారిద్దరూ శుక్రవారం తెల్లవారుజామున గడ్డిమందు తాగారు. నర్సీపట్నం మండలం కృష్ణాపురం సమీపంలో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. వీరిని బీట్ కానిస్టేబుల్ గమనించి హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. యువకుడు చేతిపై రాసుకున్న ఫోన్ నెంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు అశోక్‌ను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలికను కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా మార్గమధ్యంలోనే ఆమె మృతిచెందింది. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్టు నర్సీపట్నం రూరల్ పోలీసులకు సమాచారం అందింది.

డిజిటల్ అసిస్టెంట్‌కు రిమాండ్

- కత్తులతో మహిళను బెదిరించి మెడలో బంగారు గొలుసు అపహరణ

తొండంగి,ఏప్రిల్ 5: కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరం గ్రామంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శీలం అజయ్ కుమార్ అనే వ్యక్తి తొండంగి మండలం బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన అంబుజాలపు దేవి అనే మహిళ ను కత్తుల తో బెదిరించి మెడలో బంగారు గొలుసును దొంగిలించిన కేసులో అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా 15 రోజుల రిమాండ్ విధించినట్లు తొండంగి పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యు. కొత్తపల్లి మండలం శీలంవారిపాకలు గ్రామానికి చెందిన శీలం అజయ్ కుమార్ అనే వ్యక్తి ఏవీ నగరం గ్రామంలో డి జిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. బెట్టింగ్ వంటి చెడు వ్యసనాలకు బానిసై సుమారు 15 లక్షల రూపాయలు అప్పు చేయడంతో పాటు సచివాలయ డైలీ సర్వీసు మొత్తం 45 వేల రూపాయలు వాడుకున్నాడు. వీటిని తీర్చడానికి దొంగతనాలకు పాల్పడ్డానికి సిద్ధమయ్యాడని పోలీసులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటైన ఎఫ్ఎస్టీ బృందంలో సభ్యునిగా ఉంటూ దీనిని ఆసరాగా తీసుకుని ఓటు వివరాల కోసం వచ్చానని చెప్పి పగటిపూట ఒంటరిగా ఉండే మహిళల వివరాలు తెలుసుకుని అజయ్‌కుమార్ నేరానికి పాల్పడ్డారన్నారు. ఈ నెల రెండో తేదీన సుమారు ఒంటిగంట ప్రాంతంలో బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన అంబుజాలపు దేవి అనే మహిళ మెడపై కత్తులు పెట్టి బెదిరించి మెడలో మూడు తులాల మంగళ సూత్రాలను దోచుకు వెళ్లాడన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసామన్నారు. అతని నుంచి బెదిరించడానికి ఉపయోగించిన కత్తులు, దోచుకు వెళ్లిన మూడు తులాల మంగళ సూత్రాల తాడు, నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను స్వాధీన పర్చుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

తెలంగాణ సీఎస్ పూజలు



స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

అన్నవరం, ఏప్రిల్ 5: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతకుమారి స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందించగా పీఆర్వో స్వామివారి చిత్ర పటం, ప్రసాదాలు అందజేశారు.

శిశుగృహాలో 56 రోజుల బాలుడి మృతి

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 5: కాకినాడ శిశు గృహాలో 56 రోజుల వయస్సు ఉన్న మగ బిడ్డ మృతిచెందిన సంఘటన కలకలం రేపింది. బుధవారం అర్ధరాత్రి చిన్నారి తీవ్ర ఆయాసంతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడడంతో వెంటనే శిశుగృహ సిబ్బంది కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చిన్నారిని పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శిశుగృహ నిబంధనల ప్రకారం చిన్నారికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో ఆరా తీశారు. శిశుగృహాలో ఆశ్రయం పొందుతున్న మిగిలిన నలుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలకు శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విచారణ పూర్తయిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. గుంటూరుకు చెందిన తల్లిదండ్రులు తమ రెండు నెలల మగశిశువును కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన భార్యాభర్తలకు అనధికారికంగా దత్తత ఇచ్చారు. ఈ మేరకు వారి నుంచి రూ.లక్ష తీసుకున్నట్లు సమాచారం. శిశువు దత్తత విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్న నేపథ్యంలో దత్తత ఇచ్చిన తల్లిదండ్రులు గుంటూరు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కాకినాడ జిల్లా ఐసీడీఎస్ అధికారులు పోలీసుల సమక్షంలో మార్చి 15న కిర్లంపూడిలో బిడ్డను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడలోని శిశుగృహకు తరలించి అక్కడే ఆశ్రయం కల్పించారు. అప్పటినుంచి శిశుగృహాలో ఉన్న ఆ శిశువు బుధవారం మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది.

వలకు చిక్కిన టేకులు



మత్స్యకారుల వలకు చిక్కిన టేకులు

అంతర్వేది, ఏప్రిల్ 5: సఖినేటిపల్లి మండలం అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరులో శుక్రవారం మత్స్యకారులకు రెండు పంతాల టేకులు చేపలు చిక్కాయి. రేవులో జరిగిన వేలంలో వాటిని రూ.15 వేలకు కొనుగోలు చేశారు. టేకులు ధర తక్కువ అయినప్పటికీ తినేందుకు రుచిగా ఉంటాయని కొనుగోలుదారులు చెప్పారు.

ఎండ తీవ్రతకు బయటకు వస్తున్న సర్పాలు

- ఇందుపల్లిలో ఇంటిలోకి చొరబడ్డ గోధుమతాచును పట్టుకున్న స్నేక్ క్యాచర్



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

అమలాపురం రూరల్, ఏప్రిల్ 5: వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండడంతో విషసర్పాలు నివాస ప్రాంతాల్లోకి చొరబడుతున్నాయని స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ తెలిపారు. ఉష్ణ తాపం తట్టుకోలేక పొలాల్లో ఉండే పాములు ఇళ్లల్లోకి చేరుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఇందుపల్లిలోని పెదమల్లు లింగేశ్వరరావు ఇంట్లోకి శుక్రవారం చొరబడిన గోధుమ తాచును గణేష్‌వర్మ పట్టుకున్నాడు. పర్యావరణానికి మేలుచేసే సర్పాలను చంపవద్దని ఆయన కోరారు. సర్పాలు కనిపించిన వెంటనే తనకు ఫోన్ చేస్తే వచ్చి వాటిని బంధించి నిర్జన ప్రదేశంలో విడిచి పెడతానని చెప్పారు. వివరాలకు 9949956232 నెంబరును సంప్రదించాలన్నారు.

వివాహేతర సంబంధం అనుమానంతో వ్యక్తిపై కత్తితో దాడి

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 5: వివాహేతర సంబంధం అనుమానంతో చినజగ్గంపేటకు చెందిన సారిపల్లి అప్పలరాజుపై అదే గ్రామానికి చెందిన గుళ్ల ఏసుబాబు శుక్రవారం రాత్రి కత్తితో దాడి చేశాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. తన భార్యను వేధిస్తున్నట్లు 6నెలల క్రితం గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో అప్పలరాజుపై ఏసుబాబు ఫిర్యాదు చేయగా విచారణలో రుజువు కాకపోవడంతో కేసు నమోదు చేయలేదు. అప్పటినుంచి ఏసుబాబు కక్షగట్టినట్లు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి అప్పలరాజు అతడి స్నేహితుడు సారిపల్లి శ్రీను కుప్ప నూరుపు కూలికి వెళ్లి బరకాలు అప్పజెప్పడానికి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వెనకనుంచి గుల్ల ఏసుబాబు కత్తి పట్టుకుని వెంబడించి రెండు చోట్ల గాయపరిచాడు. సారిపల్లి శీను అడ్డగించి కత్తి లాక్కోబోతుండగా కత్తిని కింద పడేసి ఏసుబాబు పరారయ్యాడు. అప్పలరాజును సీఐ శ్రీనివాస్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వివాహేతర సంబంధం ఉందన్న అనుమానమే ఈ సంఘటనకు కారణంగా చెబుతున్నారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, ఏప్రిల్ 5: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

'కూటమి అధికారంలోకి రావాలి'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 5: వైసీపీ అరాచక పాలనతో అన్ని విధాలుగా నష్టపోయిన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు, బడుగు బలహీన వర్గాలతోపాటు మహిళలు, యువతకు అభివృద్ధి, సంక్షేమం అందాలంటే టీడీపీ కూటమి అధికారంలోకి రావాలని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కాకినాడలోని 25వ డివిజన్ పప్పులమిల్లు ప్రాంతంలో జయహో బీసీ సమావేశం నిర్వహించారు. ఆ ప్రాంతానికి చెందిన చిన్న నూకరాజు తన అనుచరులు 200మందితో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, స్థానిక నాయకులు మేడిశెట్టి చిన్ని, కొపనాతి నాగకుమారి, సంగాని నాగూర్, సంగాని గంగాధర్, వనమాడి వీరబాబు, కామాడి సీత దశరథుడు, కామాడి శ్రీను, బొమ్మిడి రాజు, ఓలేటి ఆదినారాయణ, వాడ్రేవు దుర్గారావు పాల్గొన్నారు.

'జ్యోతుల నెహ్రూను గెలిపించుకుంటాం'

కిర్లంపూడి, ఏప్రిల్ 5: జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను గెలిపించుకుంటామని జనసేన నేత తుమ్మలపల్లి రమేష్ అన్నారు. శుక్రవారం జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, బీజేపీ ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ, జనసేన, టీడీపీ నాయకులు కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలోని తుమ్మలపల్లి రమేష్‌ను కలిశారు. నెహ్రూ మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పాటుపడే తుమ్మలపల్లి రమేష్ నాయకత్వంలో రాబోయే కాలంలో జనసేన నాయకులు, కార్యకర్తలకు అన్ని రంగాల్లో అవకాశమిస్తామన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, తోట రవి, తోట గాంధీ, చదరం చంటిబాబు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, ఒకోర్పు సాయితేజ, జాస్తి వసంత్, కొత్త కొండబాబు, బుదిరెడ్డి శ్రీనివాస్, పాలిశెట్టి సతీష్, ఉలిసి అయిరాజ్, మరిసే రామకృష్ణ, దీపు పాల్గొన్నారు.

'యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం'

కరప, ఏప్రిల్ 5: వచ్చే ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని, ఎన్‌డీఏ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందిస్తూనే యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కాకినాడరూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ హామీ ఇచ్చారు. కరప పల్లపువీధి రామాలయం వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం 140 కుటుంబాలకు చెందిన మహిళలు, పెద్దలు, యువతీ యువకులు జనసేన పార్టీలో చేరగా వారికి నానాజీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జనసేన, టీడీపీ నాయకులు బండారు మురళి, బోగిరెడ్డి గంగాధర్, బోగిరెడ్డి కొండబాబు, తుమ్మలపల్లి మాచరరావు, రెడ్డిపల్లి నారాయణరావు, కాకర్ల బుజ్జిబాబు, చిన్నారి శ్రీను, శ్రీపాదం రాజు, గండి వీరబ్రహ్మం, పుణ్యమంతుల సత్యనారాయణ, గంగయ్య, శ్రీపాదం సత్యారావు, చిన్నారి భద్రరావు పాల్గొన్నారు.

తునిలో జనసేన ఆత్మీయ సమావేశం

తుని రూరల్, ఏప్రిల్ 5: తుని నియోజకవర్గ జనసేన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్రబాబు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన పద్ధతులపై జనసేన నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. రానున్న ఎన్నికల్లో సమన్వయంతో పని చేసి ఉదయ్‌శ్రీనివాస్‌తో పాటు తుని ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్యను అఖండ మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి తంగెళ్ల సమక్షంలో జనసేనలోకి చేరారు. కార్యక్రమంలో జనసేన నేత, సినీ దర్శకుడు మెహర్ రమేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి విజయ్, అధికార ప్రతినిధి దాసరి కిరణ్, తుని నియోజకవర్గ సమన్వయ కర్త గణేష్, జిల్లా కార్యదర్శి వంగలపూడి నాగేంద్ర, జిల్లా సంయుక్త కార్యదర్శి లోవరాజు, కోటనందూరు మండలాధ్యక్షుడు పెద్దాపురం శ్రీనివాస్, ధారకొండ వెంకటరమణ, అద్దెపల్లి బాలాజీ, మర్రి వీరబాబు పాల్గొన్నారు.

జనసేనలో భారీగా చేరికలు

పిఠాపురం, ఏప్రిల్ 5: పిఠాపురంలో వైసీకి చెందిన పిఠాపురం మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, శ్రీకృష్ణ యాదవ సంఘం పిఠాపురం నియోజకవర్గ అధ్యక్షుడు జోగా వీర వెంకటరమణ యాదవ్, యువజన విభాగం అధ్యక్షుడు సారిపల్లి రమేష్ యాదవ్‌లు జనసేన పార్టీలో చేరారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జనసేన ఎన్ఆర్ఐ విభాగం ఆస్ట్రేలియా కన్వీనర్ కొలికొండ శశిధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పిండి శ్రీనివాసరావు, కోన శివ, పాలకొల్లు శంకర్‌లు పాల్గొన్నారు. అలాగే పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలను చెందిన 225 మంది నాగబాబు సమక్షంలో జనసేనలో చేరారు.

పవన్‌పై అభిమానాన్ని చాటుకున్న అభిమాని

పిఠాపురం, ఏప్రిల్ 5: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై ఉన్న అభిమానాన్ని కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి వీరబాబు వినూత్న రీతిలో చాటుకున్నాడు. తన వివాహ శుభలేఖపై పవన్ ఫోటోను ముద్రించడంతో పాటు ఆయన ఇచ్చిన హామీలను ప్రచురించి గెలిపించాలని కోరారు. ఈ శుభలేఖ సామాజిక మాధ్యమాల్లో విశేష ప్రాచుర్యం పొందింది. దీనిపై జైభీమ్ రావ్ భారత్ పార్టీ పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థి జగ్గారపు మల్లిఖార్జున్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. పవన్‌ను గెలిపించమని శుభలేఖపై వేయడం ఎన్నికల నిబంధనల కు విరుద్ధమని తెలిపారు. కాగా వీరబాబు ఇంటికి ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు వెళ్లి ఆరా తీశారు. షెడ్యూల్ రాకముందే తాను శుభలేఖలు ముద్రించినట్టు వీరబాబు తెలిపారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

కరప, ఏప్రిల్ 5: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల గ్రామాల్లో పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టినట్టు ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ తెలిపారు. పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పింఛన్ల పంపిణీని పరిశీలించారు. మంచం మీద నుంచి లేవలేనివారికి, దివ్యాంగులకు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను అందించామన్నారు. 2 రోజుల్లో 89శాతం మేర పింఛన్లు పంపిణీచేశామని, మిగిలిపోయినవారికి శనివారం అందిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి గ్రాట్యుటీ సొమ్ము అందజేత

కరప, ఏప్రిల్ 5: కరప పీఏసీఎస్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి రూ.2.12లక్షల గ్రాట్యుటీ, ఎరియర్స్ సొమ్మును అందజేసినట్టు సంఘ చైర్మన్ నక్కా వీరభద్రరావు తెలిపారు. ఇక్కడ సీఈవోగా పనిచేసిన చోడపునీడి మంగతాయారు గతేడాది తన ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలి మృతిచెందారు. అయితే ఆమెకు రావాల్సిన గ్రాట్యుటీ సొమ్ము రూ.1.02లక్షలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సొమ్ము రూ.1.09లక్షలను మృతురాలి భర్త గౌతు వీరవెంకటదుర్గారావుకు అందించామన్నారు. ప్రస్తుత సీఈవో పంపన వెంకటరమణ, విశ్రాంత సీఈవో చోడపునీడి వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ

కరప, ఏప్రిల్ 5: పెనుగుదురులో పునఃనిర్మించిన ఆలయంలో శుక్రవారం దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. కాకినాడరూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవిరమేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా పార్టీల నాయకులు తుమ్మలపల్లి మాచరరావు, రెడ్డిపల్లి నారాయణరావు, బండారు సతీష్, తుమ్మలపల్లి శ్రీనివాస్, పెంకే మహేష్, మేడిశెట్టి శ్రీను, కె.భవన్నారాయణ, పితాని శ్రీను ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

తుని రూరల్, ఏప్రిల్ 5: తుని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో గల ఏడువారాల కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ వేడుక శుక్రవారం వైభవంగా జరిగింది. తాళ్ళూరు జీయర్ స్వామి మఠాధిపతులు పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యుల పర్యవేక్షణలో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు అప్పలరాజు, కార్యదర్శి కేశన కుర్తి సూర్యప్రకాష్‌లు స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించగా వేద పండితులు కల్యాణం నిర్వహించారు. మహా అన్నదానం జరిగింది.

పెద్దాపురంలో రూ.1.48 లక్షలు స్వాధీనం

పెద్దాపురం, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ. 1.48 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. స్థానిక గుర్రాల సెంటర్‌వద్ద తనిఖీలు చేసే సమయంలో ఈనగదు పట్టుబడినట్టు చెప్పారు. ఎఫ్ఎస్‌టీ టీమ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈతనిఖీల్లో బైక్‌లో అనధికారికంగా ఈనగదు తరలించడం గుర్తించగా నగదును ట్రజరీలో జమచేయడం జరిగిందని పేర్కొన్నారు.

మండుతున్న ఎండలు

జగ్గంపేట, ఏప్రిల్ 5: మండలంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడం, వడగాల్పులు వీయడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఉదయం 10గంటలకు ఎండ తీవ్రరూపం దాల్చుతుంది. జగ్గంపేట జాతీయ రహదారితో పాటు నాలుగు రోడ్ల జంక్షన్‌లో మధ్యాహ్నం సమయంలో ఎండకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.



జగ్గంపేటలో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన రహదారి

దేశ భవిష్యత్తుకు పునాది వేసిన జగ్జీవన్‌రామ్

జిల్లాలో ఘనంగా జయంతి

నివాళులర్పించిన అధికారులు, నాయకులు



కాకినాడ క్రైం: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎస్పీ నివాళి



తుని రూరల్: జగ్జీవన్‌రామ్‌కి నివాళులర్పిస్తున్న యనమల



సామర్లకోట: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి రాజప్ప నివాళి

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 5: భారతదేశ భవిష్యత్తుకు పునాది వేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ జె.నివాస్ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని కాకినాడ ఇంద్రపాలెం వద్ద ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి శుక్రవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడైన జగ్జీవన్‌రామ్ మనందరికీ స్ఫూర్తి అన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, కాకినాడ కమిషనర్ వెంకటరావు, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రమణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాకినాడ క్రైం: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జగజ్జీవన్‌రామ్ అట్టడుగు వర్గాల ఉన్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ ఎస్‌బీడీఎస్పీ శ్రీరాం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యం వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ పరిపాలనాధికారులు పాల్గొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఐక్యవేదిక ఆధ్వర్యంలో జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్ వద్ద నిర్వహించారు. బాబు జగ్జీవన్‌రామ్, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం మాస్టారు ఐక్యవేదిక ప్రతినిధులు, శ్రీ దైవ కృప ఆటో యూనియన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక ప్రతినిధులు కుందేటి మోజేష్‌కుమార్, కండవల్లి సుందర డేవిడ్‌రాజు, ఆవుపాటి ఉమాశంకర్, సాపే సుధాకర్ పాల్గొన్నారు.

తుని రూరల్: ఆదర్శనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు. తుని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్యతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుని టీడీపీ పట్టణాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కుసుమంచి శోభారాణి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగసోమరాజు, మళ్ళ గణేష్, అల్లు రాజు ఉన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాదిగ రిర్వేషన్ పోరాట సమితి సభ్యులు పాత బస్‌స్టాండ్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి స్థానికులకు పంచారు. రెడ్డి లోవరాజు, గట్టిం వెంకటరమణ, విజయకుమార్, గొల్లపల్లి త్రినాద్, ఎమ్. పాపరాజు, అనంతారపు రాజు, కాకాడ నగేశ్వరరావు, డి.కన్నారావు, కొత్తల గాంధీ, పి.నూకరాజు ఉన్నారు.

సామర్లకోట: మండలంలో అచ్చంపేటలోని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వగృహంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వేట్లపాలెం గ్రామ గూడపర్తిలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని గ్రామానికి చెందిన దళిత నాయకుల సమక్షంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి తనయుడు టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధి గుణ్ణం రిత్విక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మార్ని వెంకయ్య చౌదరి, చిల్లి మోహనరావు, అడబాల చిట్టిబాబు తదితర గూడపర్తి దళితులు పాల్గొన్నారు.

పెద్దాపురం: అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషి అమోఘమని ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆర్డీవో మాట్లాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జగ్జీవన్‌రామ్ ఆలోచనలు, దూరదృష్టి సూటిదనం, అన్నీ కలగలసి విలక్షణ నాయకుడిగా నిలిపాయన్నారు. కార్యాలయం ఏవో సుబ్రహ్మణ్యం, డీటీ భానుకుమార్ పాల్గొన్నారు.

కరప: కరప పీహెచ్‌సీ ఎదురుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి చాట్రి ఇమ్మానుయేల్, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ ఉందుర్తి ప్రకాశరావు, మండల ఎస్సీసెల్ నాయకులు దార్ల శ్రీను, నవరపు సత్తిబాబు, ఉప్పలగుప్తం దేవానందం, చినబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వలసపాకల, వేళంగి, నడకుదురు, జడ్.బావారం, గొడ్డటిపాలెంలో జయంతిని నిర్వహించారు.

గొల్లప్రోలు: పట్టణంలో అరుంధతీయపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నగరపంచాయతీ వైస్‌చైర్మన్ గంధం నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ సంఘాల నాయకులు గంధం నాగేశ్వరరావు, చినబాబు, గోరింట సత్తిబాబు, కొండ్రు లోవబాబు, గంధం దోని,దొమ్మేటి మనోహర్ ఉన్నారు.

పిఠాపురం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఉప్పాడ బస్టాండు సెంటర్‌లో సీఐటీయూ అనుబంధ రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేపట్టారు. కౌన్సిలరు పెదపాటి నాగేశ్వరరావు, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెదపాటి సత్యనారాయణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: గ్రామంలో ఆది ఆంధ్రా అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కాకాడ అబ్బు, గేడ్డం నూకరాజు, కొత్తేల ఆనంద్‌కుమార్, కొత్తేల పెద్ద, దూలపల్లి రాజుబాబు పాల్గొన్నారు.

తొండంగి: రావికంపాడులో ఎంఆర్‌పీఎస్ కార్యదర్శి ఇందుగపల్లి సురేష్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైతన్య యూత్ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

'వైసీపీ నేతలను నిలదీయాలి'

పిఠాపురం, ఏప్రిల్ 5: కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలకు కనబడని వైసీపీ నేతలు నేడు ఎన్నికల్లో ఓట్లు కోసం వస్తున్నారని, అటువంటి ప్రశ్నించి నిలదీయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని 2,3,4వార్డుల్లో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందజేశారు. పవన్ విజయం సాధించగానే పిఠాపురం ప్రాంతాన్ని టెంపుల్‌సిటీగా తీర్చిదిద్దేందుకు కేంద్రం నుంచి రూ.500కోట్లు తీసుకురానున్నారని, పశువుల సంతను అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు డ్రెయిన్లు పూర్తి చేసి తాగునీటిని పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు చేపడతారని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రజలందరికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి ప్రకాష్, వార్డు ఇన్‌చార్జిలు సోము సత్యనారాయణ, సుంకు సుబ్రహ్మణ్యం, కేశబోయిన సత్యనారాయణ, ఆలం దొరబాబు, నాయకులు పిల్లి చిన్నా, నామా దొరబాబు, అల్లవరపు నగేష్, సూరవరపు సుబ్బారావు, జనసేన నాయకులు చల్లా లక్ష్మి, పీఎస్ఎన్ మూర్తి, బీజేపీ నాయకుడు కర్నీడి తాతయ్య తదితరులు ఉన్నారు.

చేబ్రోలులో వర్మ ప్రచారం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 5: గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా శుక్రవారం సాయంత్రం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రచారం నిర్వహించారు. పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, ఓరుగంటి వీరబాబు, మడికి ప్రసాద్, రావు రవి, జనసేన నాయకులు ఉన్నారు.

'అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా'

తొండంగి, ఏప్రిల్ 5: తీరప్రాంతంలో విస్తరించి ఉన్న కోన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి యనమల దివ్య తెలిపారు. శుక్రవారం ఆమె పెరుమాళ్ళపురం పంచాయితీ లక్ష్మణుడు పేట, తలపంటి పేట, హవాల్దారుపాడు, హరా కుంపేట తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కోన ప్రాంత సమస్యలు పరిష్కరించి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించి యువతకు అండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో యనమల రాజేష్, యనమల నాగేశ్వరావు, కోడ వెంకటరమణ, అరిగెల నర్సింహమూర్తి, కొయ్యా రామకేశవ, చొక్కా అప్పారావు, కాశీ, మహంకాళి, కాలిబోయిన చంద్రరావు, చందక చినఅప్పలరాజు ఉన్నారు.

'అధికారం కూటమిదే'

ప్రత్తిపాడు, ఏప్రిల్ 5: వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా జరగబోయే ఎన్నికల్లో విజయం, అధికారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదేనని నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని గజ్జెనపూడి గ్రామంలో శుక్రవారం జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. సత్యప్రభ మాట్లాడుతూ పింఛన్ల విషయంలో వైసీపీ ప్రభుత్వం చేతకాని తనం బయటపడిందని దాన్ని కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై నెపం నెట్టడానికి ప్రయత్నించిందని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లాగోపి, దాకారపు కృష్ణ, పంచాది వీరబాబు, గోకాడ చిన్న, బీజేపీ నాయకులు కందా వీరాస్వామి, చింతాకుల రామకృష్ణ, కించు జోగిరాజు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రం అప్పులపాలు'

కిర్లంపూడి, ఏప్రిల్ 5: జగన్ పాలనలో రాష్ట్ర అప్పులపాలైందని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత అన్నారు. మండలంలోని భూపాలపట్నంలో సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపునకు సమష్టి కృషి చేయాలన్నారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, భూపాలపట్నం ప్రసాద్, తోట సర్వారాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు





జగ్గంపేట: టీడీపీలో చేరినవారితో నెహ్రూ, ప్రత్తిపాడు: టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

జగ్గంపేట, ఏప్రిల్ 5: జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన వైసీపీ యువ నేత మరుకుర్తి వీర గంగాధర్, మరుకుర్తి రామారావు, మరుకుర్తి ఏసుబాబు, మరుకుర్తి ఒరామోజీరావు, కట్టిమేను పెద్ద రాంబాబు తదితర 50 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి రాష్ట్ర టీడీపీ యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, మండపాక వెంకటాచలం, మండపాక పాపారావు, మొగిలి గంగాధర్, మండపాక వెంకటేశ్వరరావు, రీస్ రమణ, మండపాక పెద్దకాపు, అనుబాల పెద్దబాబు, అడబాల సూరిబాబు, నీలం నాగులు, చేదులూరి పెద్దకాపు, బోధ శివ, మాగంటి ఏసు, అడబాల సత్యనారాయణ, మండపాక పెద్ద, బూసిచిన్న, జుత్తుక రమేష్ తదితరులు ఉన్నారు.

కిర్లంపూడి: గోనేడ గ్రామంలో వైసీపీ నుంచి 200మంది టీడీపీలో చేరారు. రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి నీలం శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో పార్టీలో చేరిన వారికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.టీడీపీ, జనసేన నాయకులున్నారు.

రౌతులపూడి/ప్రత్తిపాడు: రౌతులపూడి మండలం దిగిశివాడ గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలకు చెందిన వారు ప్రత్తిపాడులో ఎన్డీఏ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, పంచాద బుజ్జీ, మువ్వల శ్రీను, చిటికెల అడవిరాజు, చింతకాయల శివ, కోరుప్రోలు నానాజీ, కామిరెడ్డి యరకయ్య తదితరులు ఉన్నారు.

సామర్లకోట: పట్టణ 8వ వార్డు వైసీపీ కౌన్సిలర్ పిల్లాడి సత్యవతి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సత్యవతికి ఎమ్మెల్యే చినరాజప్ప పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. స్థానిక కొత్తూరుకు చెందిన వైసీపీ నేత పాలచర్ల కళ్యాణ్‌కుమార్ తదితర కార్యకర్తలు వైసీపీని వీడి టీడీపీలో చేరగా ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి అభినందించారు. అలాగే సామర్లకోటలోని 1వ వార్డు పెన్షన్ లైన్. ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు, పేరంటాలు పుంత తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన ఇన్‌చార్జి తుమ్మల బాబు, బీజేపీ ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణలు ఇంటింటా ప్రచారాన్ని చేశారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 1వ వార్డు రాజీవ్ గృహకల్ప సముదాయాలకు చెందిన సుమారు 100 కుటుంబాలకు చెందిన మహిళలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు.

తాళ్లరేవు: ఓఎన్‌జీసీ నష్టపరిహారం రానివ్వకుండా సొసైటీని రిజిస్టరు చేయనివ్వకుండా అడ్డుకున్న వైసీపీ నేతల అరాచకాలకు విసుగు చెందిన కోరింగ పంచాయతీ సీతారామపురం మత్స్యకారులు, శెట్టిబలిజ, కాపు, ఎస్సీ కులాలకు చెందిన 44మంది వైసీపీ కార్యకర్తలు ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కాశీవిశ్వనాద్ ఉన్నారు.



ఎస్.అన్నవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పోలీసుల కవాతు

తుని రూరల్, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సీఏఎస్ఎఫ్ దళాలతో శుక్రవారం తుని రూరల్ సీఐ మూర్తి, ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో మండలంలో ఎస్.అన్నవరం, వల్లూరు, సీతయ్యపేట, అగ్రహారం, చామవరం గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని, ఓటు వాక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఎమ్మెల్యేగా గెలిపించండి'

రౌతులపూడి, ఏప్రిల్ 5: మా నాన్న దివంగత నేత వరుపుల రాజా ఆశయ సాధనకు నా తల్లి సత్యప్రభను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా నెగ్గించాలని రాజా తనయుడు వరుపుల తర్షిత్ కోరారు. తల్లికి మద్దతుగా రౌతులపూడి మండలం దిగిశివాడలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రౌతులపూడి, మల్లంపేట, మల్లవరం, బలరామపురం, మూలగపూడి, రాజవరం, దిగిశివాడ గ్రామస్తులు స్వాగతం పలికారు.

పురందేశ్వరిని కలిసిన బీజేపీ నాయకులు



పురందేశ్వరిని కలిసిన ప్రత్తిపాడు నాయకులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 5: రాజమహేంద్రవరానికి శుక్రవారం విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిని ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మట్టా మంగరాజు, ఉమ్మడి వెంకట్రావు బొకే అందజేసి అభినందించారు. అనంతరం కాకినాడ జిల్లాలో బీజేపీ పరిస్థితులను చర్చించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

గండేపల్లి, ఏప్రిల్ 5: సూరంపాలెంలోని ఆదిత్య విద్యాప్రాంగణంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్స్‌లో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన తృతీయ ట్రిపుల్ ఈ విభాగం జట్టు ప్రథమస్థానంలో నిలవగా రూ.15వేలు నగదు బహుమతి సాధించారు. విజేతలకు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ దోలా సంజయ్, డాక్టర్ ఎం.ఆదిరెడ్డి రమేష్ బహుమతులు అందించారు. జీవీ ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాదగయలో తెలంగాణ సీఎస్ ప్రత్యేక పూజలు



పాదగయ పూజల్లో శాంతికుమారి

పిఠాపురం, ఏప్రిల్ 5: పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సందర్శించారు. శుక్రవారం పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకున్నారు. క్షేత్ర ప్రాశస్త్యం వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ ఈవో పులి నారాయణమూర్తి శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఔదంబర వృక్షం చుట్టూ ప్రదిక్షణలు చేశారు. సీఎస్ శాంతకుమారిని ఆలయ ఈవో సౌజన్య శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

సామర్లకోటలో...

సామర్లకోట, ఏప్రిల్ 5: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో శుక్రవారం సాయంత్రం తెలంగాణ సీఎస్ శాంతకుమారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు జిల్లా దేవాదాయాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు సాదరంగా స్వాగతం పలికారు. స్వామి,అమ్మవార్లకు విశేష అభిషేకపూజలు నిర్వహించారు. నంది మండపం వద్ద వేదపండితులచే వేదస్వస్తి పలికి ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, శేష వస్త్రాలను శాంతకుమారికి అందజేశారు.

తెలంగాణ సీఎస్‌ను కలిసిన కలెక్టర్



సీఎస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 5: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతి కుమారిని జిల్లా కలెక్టర్ జె.నివాస్ శుక్రవారం కాకినాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు కలెక్టర్ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

అశోక్‌బాబును కలిసిన యనమల

తుని రూరల్, ఏప్రిల్ 5: తుని మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌వీవీ కృష్ణంరాజు (రాజా అశోక్‌బాబు)ను తునిలో ఆయన నివాసంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు మర్యాదపూర్వకంగా కలిశారు. అశోక్‌బాబు యనమలను సత్కరించి కాసేపు ముచ్చటించారు. యనమల వెంట టీడీపీ నాయకుడు చిరంజీవిరాజుతో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారు.

గడ్డివాము దగ్ధం

కోటనందూరు, ఏప్రిల్ 5: మండలంలో కేఎస్.కొత్తూరు గ్రామంలో పైల దాలియ్యనాయుడుకి చెందిన గడివాము దగ్ధమైంది. 11కేవి చెందిన విద్యుత్ వైర్లు కలిసిపోవడంతో వాము దగ్ధమవ్వగా రూ.20వేలు నష్టం వాటిల్లినట్టు రైతు తెలిపాడు.

తాటాకిల్లు దగ్ధం

కొట్టాం గ్రామశివారు కొత్తూరు గ్రామంలో కోరుప్రోలు జగదాంబకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. రూ.30వేలు నగదుతో పాటు బంగారం, వెండి వస్తువులు కాలి బూడిదయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి

కాజులూరు, ఏప్రిల్ 5: కాజులూరు మండలంలో తిప్పరాజుపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మడికి నాగేశ్వరరావు(63) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గ్రామ సమీపంలో రోడ్డుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలవ్వగా స్థానికులు ఆసుపత్రికి తరలించేలోపే అక్కడికక్కడే ఆయన దుర్మరణం చెందారు. మృతదేహాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం, ఏప్రిల్ 5: మరిడమ్మకు దేవస్థానం వేదపండితుల ఆధ్వర్యంలో బంగారు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు.

ఆలయ ప్రాంగణంలో షెడ్డు ఏర్పాటు

ఏలేశ్వరం, ఏప్రిల్ 5: మండలంలోని సిరిపురంలో నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన మానూరి గంగరాజు లత దంపతులు రూ.40వేలతో రేకుల షెడ్డు నిర్మించారు. నూకాలమ్మ తీర్థం సందర్భంగా మానూరి కుటుంబం షెడ్డు నిర్మించారని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.